విలేకరులు కావలెను
మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189

TITLE Code TEL TEL12230
మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA



హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల    గురువారం 14 నవంబర్ 2024    పేజీలు :5 వెల : 2.00

## ఫార్మా విలేజ్ ప్రాజెక్టుపై వెనక్కి తగ్గేది లేదన్న సీఎం సోదరుడు



కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా విలేజ్ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం వెనక్కి తగ్గేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి బుధవారం ప్రకటించారు.సోమవారం లగచర్ల గ్రామంలో ప్రతిపాదిత ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ గ్రామస్తులు, రైతులు వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారులపై దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో కొడంగల్ కాంగ్రెస్ ఇంఛార్జ్ తిరుపతిరెడ్డి ఈ ప్రాజెక్టుపై స్పందించారు. ఆయన ఈరోజు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ప్రతిపాదిత ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు.ఇక్కడకు పరిశ్రమ తప్పకుండా వస్తుందని, ఫార్మా మాత్రమే కాకుండా ఇతర కంపెనీలు కూడా వస్తాయన్నారు. ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు.కలెక్టర్, ఇతర అధికారులపై దాడిని తిరుపతి రెడ్డి ఖండించారు. దాడికి పాల్పడిన వారందరూ అరెస్ట్ అవుతారన్నారు. ఫార్మా ప్రాజెక్టుపై శాంతియుతంగా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుంటే అమాయకులను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వం భూములను బలవంతంగా లాక్కుంటోందన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై తిరుపతి రెడ్డి స్పందించారు.బీఆర్ఎస్ హయాంలో మల్లన్న సాగర్ ప్రాజెక్టు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసినట్లుగా తాము రాత్రికి రాత్రే గ్రామాలను ఖాళీ చేయించడం లేదని చురక అంటించారు. రైతులపై దాడులు కూడా చేయడం లేదన్నారు.బీజేపీ ఎంపీ డీకే అరుణ ఈరోజు కలెక్టర్ ప్రతీక్ జైన్ను కలిశారు. లగచర్ల ఘటనపై ఆయనను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు, ఆమె లగచర్ల గ్రామానికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆమెను అడ్డుకున్నారు. పోలీసుల తీరును నిరసిస్తూ మన్నెగూడ ప్రాంతంలో ఆమె రోడ్డుపై బైఠాయించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది

## ఎస్పీ ఆధ్వర్యంలో పట్నం నరేందర్ రెడ్డి విచారణ




బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని వికారాబాద్ జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. బుధవారం ఉదయాన్నే పోలీసులు ఆయన్ని విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు.వికారాబాద్ కలెక్టర్ ప్రతిక్ జైన్, కడా స్పెషల్ ఆఫీసర్లపై దాడి చేసిన ఘనటలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. బుధవారం ఉదయం 6గంటలకు కేబీఆర్ పార్క్ దగ్గర బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం ఆయన్ని వికారాబాద్ జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్ కు తరలించారు.వికారాబాద్ జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో ఉన్న పట్నం నరేందర్ రెడ్డిని కలవడానికి వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్వరెడ్డి, వికారాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలు వచ్చారు. మెతుకు ఆనంద్, మహేశ్వరెడ్డిలను పోలీసులు లోనికి అనుమతించారు.పట్నం నరేందర్ రెడ్డి ప్రధాన అనుచరుడు భోగమోని సురేష్ అధికారులను గ్రామంలోకి తీసుకెళ్లారు. అప్పుడే గ్రామస్తులు ఫార్మాసిటీ భూసేకరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లారు. ఈక్రమంలో గ్రామస్థులు ప్రభుత్వ అధికారులపై దాడి చేశారు. దాడి ఘటనలో కీలక వ్యక్తి భోగమోని సురేష్ తో చాలా సార్లు పట్నం నరేందర్ ఫోన్లో మాట్లాడారని తెలిసింది. ప్రస్తుతం భోగమోని సురేష్ పరారీలో ఉన్నాడు.

## హైదరాబాద్ కు రాష్ట్రపతి..
## కోటి దీపోత్సవానికి హాజరు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21,22 తేదీల్లో హైదారాబాద్ లో పర్యటించనున్నారు. ఈ నెల 21వ తేదీ గురువారం సాయంత్రం ఆమె హకీంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.అక్కడి నుంచీ నేరుగా ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే కోటి దీపోత్సవానికి హాజరవుతారు. 22వ తేదీ శుక్రవారం హైటెక్ సిటీలోని శిల్పకళా వేదికలో జరిగే లోక్ మంతన్ 2024 ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

### ఖైరతాబాద్, లక్డీకపూల్లో మేయర్ గద్వాల విజయలక్ష్మీ తనిఖీలు

## రెస్టారెంట్ ఓనర్ పై సీరియస్




ఖైరతాబాద్, లక్డీకపూల్ ఏరియాలోని హెూటల్స్, రెస్టారెంట్లు, కిచెన్లలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ బుధవారం (నవంబర్ 13) ఆకస్మిక తనిఖీలు చేశారు.ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి ఖైరతాబాద్?లోని మొఘల్ రెస్టారెంట్లో ఆహార పదార్థాల తయారీనీ తనిఖీ చేసిన మేయర్.. కిచెన్ పూర్తిగా అపరిశుభ్రంగా ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ పక్కనే వంట చేస్తుండటం గమనించిన మేయర్.. రెస్టారెంట్ ఓనర్?పై సీరియస్ అయ్యారు. కుళ్లిపోయిన నాన్ వెజ్ వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు.. మేయర్ ఆదేశాల మేరకు మొఘల్ రెస్టారెంట్?ను క్లోజ్ చేశారు. రెస్టారెంట్?ను సీజ్ చేసిన అధికారులు కిచెన్?లో ఫుడ్ శాంపిల్స్ సేకరించి ల్యాబ్?కు పంపారు. కల్తీ ఆహార పదార్థాలతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా మేయర్, ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు.

### కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటి




దేశ రాజధాని దిల్లీ నగరంలో మంగళవారం కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి అధ్యక్షతన, రాష్ట్రాల, కేంద్రపాలితప్రాంతాల విద్యుత్ శాఖ మంత్రుల సమావేశం జరిగింది.ఇండియా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్పో సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్య క్రమానికి తెలంగాణ రాష్ట్రం తరఫున ఉప ముఖ్య మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క , ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా దక్షిణ తెలంగాణ విద్యు త్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషరఫ్ ఫరూఖి, ఐఏఎస్ ఈ సమా వేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్‌తో ప్రత్యేకంగా సమావేశమైన ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రానికి సంబంధించిన వివిధ విద్యుత్ సంబంధిత అంశాలను చర్చించారు.

మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA
epaper
చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA

## తినే ఆహారంలో ఐరన్ స్ప్రింగ్
## కామన్ అంటున్న యజమాని




**-ఫుడ్ ఇన్స్పెక్టర్ జర దేకో జి...**

**జగిత్యాల నవంబర్ 13 (మన వార్త ప్రతినిధి సాకేత)**

జగిత్యాల పట్టణంలో ఆహార నాణ్యతకు పేరు గాంచిన కొన్ని హెూటల్స్ లో ఇటీవల వెలుగు చూస్తున్న ఘటనలు సంచలనంగా మారాయి. కొద్దిరోజుల క్రితమే పట్టణంలోని గణేష్ ఉడిపి హెూటల్ లో ఇడ్లి లో జెర్రీ రావడం తో కస్టమర్ హెూటల్ నిర్వాహకుల తీరుపై మండిపడ్డారు. అది జరిగిన రోజుల వ్యవధిలోనే కొత్త బస్టాండ్ సమీపంలో గల ముత్తు టిఫిన్ సెంటర్లో ఇడ్లీలో ఏకంగా పెద్ద సైజు బొద్దింక రావడం తో కస్టమర్ ఖంగుతున్నాడు. ఇటీవల జరిగిన ఈ రెండు సంఘటనలు మరువక ముందే జగిత్యాల పట్టణంలోని సామంతుల స్వగృహ భోజనశాలలో మధ్యాహ్నం భోజనం చేసేందుకు వెళ్లిన ఒక కస్టమర్ కు అన్నంలో స్ప్రింగ్ వచ్చింది. దీంతో వెంటనే హెూటల్ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కష్టమర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అప్పుడప్పుడు ఇలాంటివి జరగడం కామన్ అంటూ హెూటల్ యజమాని చెప్పడంతో కస్టమర్ మండిపడ్డారు.అంతే కాకుండా ఎం చేస్తావో చేసుకో అంటూ దురుసుగా వ్యవహరించాడు. కొంతకాలం క్రితం ఇదే సామంతుల స్వగృహ భోజనశాలలో తనిఖీలు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫుడ్ లో నాణ్యత లోపాలున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా 2,50,000 రూపాయలు ఫైన్ విధించడంతో 50వేల రూపాయలు చెల్లించిన సదరు యజమాన్యం మరో రెండు లక్షల రూపాయల జరిమానా చెల్లించాల్సి ఉంది. ఈ ఘటనపై ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష ను వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని ఎంక్వయిరీ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## ఇంజెక్షన్ కోసం గంటసేపు ఎదురు చూసిన నిండు గర్భిణీ



**–వైద్యులతో పాటు సిబ్బంది లేకపోవడంతో రోగుల అవస్థలు...**

**శంకరపట్నం:నవంబర్ 13(మనవార్త ప్రతినిధి నేరెళ్ళ సంతోష్)**

శంకరపట్నం మండలం కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ వేసుకునేందుకు వచ్చిన నిండు గర్భిణి గంటపాటు ఎదురుచూసినా వైద్యులతో పాటు వైద్య సిబ్బంది రాకపోవడంతో ఇంటికి విను తిరిగి పోయిన సంఘటన జరిగింది. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామానికి చెందిన తుమ్మ పద్మ కు మొదటి కాన్పులో కూతురు జన్మించగా ప్రస్తుతం పాప వయసు 5 సంవత్సరాలు. ప్రస్తుతం పద్మ ఏడు నెలల గర్భవతి కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్ దగ్గర వైద్య పరీక్షలు చేసుకున్నారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్నందున ఇంజెక్షన్లు వేసుకోవాలని సిఫార్సు చేశారు. రోజు గడిచి రోజు 8 ఇంజెక్షన్లు వేసుకోవాలని సూచించడంతో సోమవారం కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ వైద్యుల పర్యవేక్షణలో స్టాఫ్ నర్స్ ఇంజెక్షన్ వేశారు. బుధవారం మరో ఇంజెక్షన్ వేసుకునేందుకు వెళ్లగా ఆసుపత్రిలో వైద్యులతో పాటు సిబ్బంది లేక ఖాళీగా ఉంది. గంటపాటు ఎదురు చూడగా ఏఎన్ఎం లలిత వచ్చారు, ఆమె వైద్యుల సమక్షంలో స్టాఫ్ నర్సు ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ వేస్తారని మరుసటి రోజు రావాలని సూచించారు.దీంతో గంటపాటు ఆసుపత్రిలో ఎదురుచూసిన నిండు గర్భిణి భర్త రాజుతో కలిసి ఇంటి దారి పట్టారు.

## బాధితుడికీ ఎల్ఓసి అందజేసిన ఉజ్వల్ రెడ్డి



**జహీరాబాద్, నవంబర్ 13 (మన వార్త):** జహీరాబాద్ పార్లమెంటు నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుడు సిద్ధం ఉజ్వల్ రెడ్డి బాధితుడికి ఎల్ఓసి అందజేశారు. కోహీర్ మండలం బడంపేట గ్రామానికి చెందిన సజ్జాపూర్ నర్సింహులు అనారోగ్య సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ఆర్థిక సహాయం కొరకు తెలంగాణ రాష్ట్ర సెట్విన్ చైర్మన్ యన్ గిరిధర్ రెడ్డిని సంప్రదించారు. స్పందించిన సెట్విన్ చైర్మన్ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో బాధితుడు నర్సింహులు కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రెండు లక్షల యాభై వేల రూపాయల ఎల్ఓసి ని మంజూరు చేయించారు. అట్టి ఎల్ఓసి ని ఉజ్వల్ రెడ్డి చేతుల మీదుగా బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాంలింగా రెడ్డి, సిడిసి చైర్మన్ ముబీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నివారణ టీబి చాంపియన్ శిక్షణ కార్యక్రమం



**–వేములవాడ రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు...**

**వేములవాడ నవంబర్ 13 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంపాక్ట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా టిబి చాంపియన్ శిక్షణను జిల్లా అధికారి దండు బోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధితో పోరాడి గెలిచిన వారిని ఎంపిక చేసి వారికి క్షయ వ్యాధి నివారణ పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ శిక్షణ ఇచ్చిన అనంతరం వారిచే గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తద్వారా గ్రామంలో క్షయ వ్యాధితో బాధపడుతున్న వారిలో ధైర్యం పెంపొందుతుందని అన్నారు. జిల్లాను క్షయ వ్యాధి రహిత జిల్లాగా మార్చడమే ఇంపాక్ట్ ఇండియా ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. క్షయ వ్యాధి తో బాధపడేవారు తగు జాగ్రత్తలు వహించడం వల్ల ఇతరులకు వ్యాధి సంక్రమించకుండా ఉంటుందని సూచించారు. ప్రభుత్వం క్షయ వ్యాధికి ఉచిత వైద్యం అందిస్తుందని లక్షణాలు ఉన్నవారు అశ్రద్ధ వహించకుండా వెంటనే నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా టీబి అధికారి వాసవ చారి, మెడికల్ ఆఫీసర్ దివ్యశ్రీ, సూపర్వైజర్ గంగమ రాజు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## ప్రియురాలిని 20 ముక్కలుగా నరికి గోనె బస్తాలో పెట్టి పొలంలో పూడ్చి పెట్టిన ప్రియుడు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 13 నవంబర్ (మన వార్త ప్రతినిధి) .**

జూలూరుపాడు మండలం మాచినేనిపేటలో ప్రియురాలు స్వాతిని మూడు రోజుల క్రితం చంపి గోనె బస్తాలో పెట్టి పొలంలో పూడ్చి పెట్టిన ప్రియుడు వీరభద్రం.గతంతో సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తామని.. ఓ జంట దగ్గర నుండి రూ. 16 లక్షలు తీసుకున్న స్వాతి– వీరభద్ర ఉద్యోగం రాకపోవడంతో, మోసపోయి ఆత్మహత్య చేసుకున్న బాధితులు ఆ 16 లక్షల విషయంలో స్వాతి– వీరభద్రంకు మధ్య విబేధాలు ఏర్పడ్డాయి దీంతో స్వాతిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని దారుణంగా హత్య చేసిన ప్రియుడు..

## కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తె మట్టెల వితరణ



**ఇల్లంతకుంట నవంబర్: 13 (మన వార్త ప్రతినిధి బొంగోని రాజు)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన పాడిరైతు దారవేణి లక్ష్మి – మల్లేశం ల కూతురు మంగ వివాహానికి కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో కళ్యాణమస్తు పథకంలో భాగంగా పుస్తె మట్టెలు అందజేసిన రూట్ సూపర్వైజర్ గుర్రం సతీష్ రెడ్డి. ఈ కార్యక్రమంలో చిట్టి వెంకట్రాంరెడ్డి,ఎం.పి.ఐ.అధ్యక్షులు చిట్టి వెంకట్ రాజిరెడ్డి,డైరెక్టర్లు సత్యనారాయణ,సెక్రెటరీ మల్లారెడ్డి,పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల నాట్య మయూరి చిన్నారి లాస్య ప్రియ

– బాలల దినోత్సవ సందర్భంగా మన వార్త ప్రత్యేక కథనంలో జగిత్యాల నాట్యమయి గురించి చిన్నారి లాస్య ప్రియ ప్రస్థానం మీ ముందుకు...






**మన వార్త** :ప్రస్తుత కాలంలో ప్రతి కుటుంబంలో చిన్నతనం ఉండే చదువే బాల్యంగా సాగుతున్న తరుణంలో తమ పిల్లల ఆలోచనను గుర్తించి,నాట్య రంగంలో ముందుకు తీసుకెళు న్న ఘనత చిన్నారి లాస్య ప్రియ తల్లిదండ్రులది అనడంలో అతిశయోక్తి లేదు.వివరాల్లోకి వెళితే....జగిత్యాలకు చెందిన 12 సంవత్సరాల చిన్నారి లాస్య ప్రియ తల్లితండ్రులు తండ్రి జగదీశ్వర్ శర్మ ,ప్రభుత్వ ఉద్యోగి .తల్లి యమున కూచిపూడి ,నాట్య గురువు.ప్రస్తుతం ఆరో తరగతి చదువుతుంది. లాస్య ప్రియకు నాట్యం అంటే మక్కువ ఎక్కువ. అందుకే తన నాలుగో ఏటే నాట్యం నేర్చుకోవడం ప్రారంభించింది. తన లోపల ఉన్న ప్రతిభను గుర్తించిన తన తల్లి యమునా తానే గురువై నాట్యం నేర్పడం విశేషం.తను చిన్న వయసు నుంచి నాట్యం నేర్చుకోవడం ప్రారంభించి ప్రస్తుతం తల్లి దగ్గరే కూచిపూడిలో శిక్షణ పొందుతున్న ఈ చిన్నారి ఇప్పటివరకు 100 ప్రదర్శనలు ఇచ్చింది. శాస్త్రీయ నృత్యం నేర్చుకోవడమే కష్టం అనుకుంటే అతి అతి తక్కువ కాలంలోనే మెలకువలన్నీ నేర్చుకొని తన ప్రతిభతో అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వేములవాడ ధర్మపురి బాసర శ్రీశైలం తిరుపతి అన్నవరం యాదగిరిగుట్ట స్వర్ణ గిరిలో ప్రత్యేక ప్రదర్శనలు ఇచ్చి పలువురి మన్ననలు పొందింది.**చిన్న వయసునుండే తల్లిదండ్రులతో ఉత్సాహంతో ప్రదర్శనలు...**చిన్న వయసులోనే అన్నమాచార్య కీర్తనలు, భక్తి గీతాలు ,కూచిపూడి జతులు శబ్దాలు ,తరంగం, భామ కలాపం లాంటివి నేర్చుకొని చక్కని




హావాభావాలతో ప్రదర్శనలు ఇస్తుంది చిన్నారి లాస్య ప్రియ. లాస్య ప్రియ ఇన్ని ప్రదర్శనలు ఇంత తక్కువ కాలంలో ఇవ్వడానికి తన వెన్నుముకగా నిలుచున్నటువంటి వ్యక్తి లాస్య ప్రియ తల్లి యమున . యమున కూడా వారి తల్లిదండ్రుల ప్రోత్సాలంతోటే కూచిపూడి నాట్యం నేర్చుకొని తన చిన్నతనంలోనే ఎన్నో పురస్కారాలను పొంది ఎంతోమంది ప్రముఖులం ప్రశంసలను తీసుకొని దానికి కారణమైన వారి తల్లిదండ్రుల పేరు మీదుగా జగిత్యాలలో ఏర్పాటు చేసిన శ్రీ శారదా సిద్ధి రామ నాట్యలయం అనే పేరుతోనే శిక్షణ ఆలయాన్ని స్థాపించారు. శ్రీ శారద సిద్ధి రామ నాట్యాలయంలో తన కూతురితో పాటు అనేకమంది చిన్నారులకు శిక్షణ ఇప్పించి ప్రదర్శనలు చేయించి పిల్లల



తల్లిదండ్రులతో కూడా మెప్పును పొందుతున్నారు. తన తల్లి లాగానే లాస్య ప్రియ కూడా ఎప్పటికైనా అమ్మమ్మ తాతల పేరు మీద సొంతంగా ఒక నాట్యం ప్రారంభించి చిన్నారులకు నాట్యం నేర్పించాలనేది తన కల. అటు చదువు ఇటు నాట్యం రెండు కష్టమైనా తనకు నాట్యం పై ఉన్న ఇష్టంతో అమ్మ దగ్గర శిక్షణ పొందుతుంది. **అవార్డుల సునామి లాస్య ప్రియ ...**2021 లో శ్రీహరి క్లాసికల్ డాన్స్ అకాడమీ హైదరాబాద్ వారి నాట్య మయూరి అవార్డు కైవసం చేసుకుంది. 2022లో కీర్తి ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారి కళా కీర్తి కిరణం అవార్డు కైవసం చేసుకుంది.శ్రీ లంబోదర కల్చరల్ అకాడమీ సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో కార్యక్రమాలలో పాల్గొని నాట్య ఊర్వశి, బాలానాట్య రత్న, జాతీయస్థాయిలో శివ నంది ,స్వర్ణ నటరాజ నంది అవార్డులు అలాగే ఆదియోగి అవార్డు లాంటి పలు అవార్డులను సొంతం చేసుకుంది.సనాతన కల్చరల్ ఆర్గనైజేషన్ నిజామాబాద్ వారి అధ్వర్యంలో ప్రదర్శనలు ఇచ్చి వారి ఆర్గనైజేషన్ తరపున నాట్య కుసుమం అవార్డు, అలాగే





జాతీయస్థాయిలో నటరాజ పురస్కారాన్ని, నాట్య సరస్వతి అవార్డును గెలుచుకుంది. కళానిలయం హైదరాబాద్ వారిచే నటరాజ పురస్కారాన్ని గెలుపొందింది. 2024లో ఆర్కే కళా సంస్కృతిక ఫౌండేషన్ హైదరాబాద్ వారిచే విశిష్ట బాలాజీ పురస్కారం అందుకుంది. అలాగే జై జవాన్ జై కిసాన్ జై కళాకార్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ సనాతన బుక్ ఆఫ్ రికార్డ్స్ వారిచే సర్టిఫికెట్ మరియు అవార్డుని గెలుచుకుంది.2024లో శ్రీమువ్వ గోపాల కల్చర్ అకాడమీ విజయవాడ వారి నాట్య శిఖ అవార్డు తనని వరించింది.అంతేకాకుండా బృందనాట్యం పేరిట 108 కళాకారులచే జరిగిన నృత్య ప్రదర్శనలో పాల్గొని డివోషనల్ అండ్ స్పిరిచువల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో పేరు సంపాదించుకుంది.**కళకు జీవం పోస్తున్న తల్లి కూతుర్లు...** అంతరించిపోతున్న భారతీయ కళలు కాపాడడం వాళ్ల వృత్తిగా ప్రవృత్తిగా భావించి కూచిపూడి నాట్యాన్ని ఆసక్తి ఉన్నవాళ్ళకి నేర్పించడంలో ఈ తల్లి కూతుర్ల కృషి అమోఘం, అభినందనీయం.**లాస్య ప్రియ మాట్లాడుతూ** అమ్మ బాటలో ముందుకు వెళుతూ అమ్మ తన కళ తో తాను కల నెరవేర్చుకున్నట్టుగా నేను కూడా ఎదిగి నా సొంతంగా శిక్షణ ఇచ్చే గొప్ప స్థాయిని చేరుకోవాలని ఉంది.మన నాట్యం విలువను చెప్పుతూ ఎంతోమందిని నాట్య కళాకారులుగా తీర్చిదిద్దాలని ఆశపడుతున్నాను. దేశ విదేశాల్లో ప్రదర్శనలు ఇవ్వాలని మన యొక్క ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని అనుకుంటున్నాను అన్నారు.తల్లిదండ్రులు **యమునా జగదీశ్వర్ శర్మ మాట్లాడుతూ** మా కూతురు ఏకసంతాగ్రహి. ఏ పాత్రనైనా ఇట్టే అవకాశం చేసుకొని చూసే వీక్షకులకు ఆనందమైన బాధనైనా వాళ్ళ కళ్ళల్లో కనిపించే విధంగా నృత్య ప్రదర్శన చేయడం తనకు చిన్ననాటి నుంచే అలవాటు. తండ్రి వైపు నుండి సరస్వతి దేవిని తల్లి వైపు నుండి కళామతల్లిని దీవెనగా పొంది దేశ విదేశాల్లో కూడా తన ప్రదర్శనలు ఇచ్చే అంత స్థాయికి రావాలని తల్లితండ్రుల పేరు నిలబెడుతూ, తల్లి యొక్క చిరకాల కలని ,లాస్య ప్రియ యొక్క సొంత నాట్యాలయం పెట్టాలన్న కోరికని నెరవేర్చుకుంటుందని ఆశిస్తున్నాం అన్నారు.

## అంధులలో అక్షర జ్యోతిని వెలిగించిన గొప్ప సంఘసంస్కర్త వాలంటిన్ హాయ్



**కుత్బుల్లాపూర్,నవంబర్,13,(మన వార్త)**

**–ఎమ్మెల్యే కెపి.వివేకానంద్..**

**–సూరారంలో ఘనంగా "వాలెంటిన్ హాయ్" జయంతి వేడుకలు...**

130 – సుభాష్ నగర్ డివిజన్ లూయిస్ బ్రెయిలీ భవనం నందు వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "వాలెంటిన్ హాయ్" జయంతి వేడుకలకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై "వాలెంటిన్ హాయ్" చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ సమాజంలో అంధుల పట్ల జరుగుతున్న వివక్షతకు చలించి వారి కోసం 1784లో ప్రపంచంలోనే మొట్టమొదటి అంధ పాఠశాలను ఏర్పాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త "వాలెంటిన్ హాయ్" అని అన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు నా దృష్టికి తీసుకువస్తూ సమస్యల పరిష్కారానికి "వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్" సంఘ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయం. రానున్న రోజుల్లో కూడా "వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్" సంఘం సభ్యులకు నా మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు. అనంతరం పలువురు అంధులు, వికలాంగులకు ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేశారు.అనంతరం వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ సంఘ సభ్యులు మాట్లాడుతూ "ప్రజా సంక్షేమం కోసం నేనున్నానంటూ ఎప్పుడూ ముందుండే నాయకులు, కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని అన్నారు. దివ్యాంగుల బస్ పాస్ కోసం అసెంబ్లీలో మొట్టమొదటిసారి మాట్లాడిన నాయకులు మన ఎమ్మెల్యే అని అన్నారు. అదేవిధంగా సూరారం కాలనీకి బస్సు సర్వీసులను పునఃప్రారంభించాలని కోరగా వెంటనే స్పందించి బస్సు సర్వీసులను పునఃప్రారంభించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. మా వెంటే ఉంటూ మా సంక్షేమానికి కృషిచేసే ఎమ్మెల్యే సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు పెద్ద వెంకటస్వామి, గుబ్బల లక్ష్మీనారాయణ, ప్రభాకర్, ఇస్మాయిల్, జావిద్, మధు, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్డ్ సంఘ అధ్యక్షులు అంజయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు యాదయ్య యాదవ్, సభ్యులు దేవి, శేఖర్, ఆంజనేయులు, సత్యం, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక–ఆర్థిక సర్వేలకు హాజరైన కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి



**మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 13 మన వార్త ప్రతినిధి అంతోని** : మచ్చ బొల్లారం డివిజన్ 133 కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ తో కలిసి డి సి తో హనుమాన్ టెక్డిలో సామాజిక–ఆర్థిక సర్వేలకు హాజరైన తర్వాత ఎంపిక చేసిన టాకీస్‌లో హనుమాన్ ఆలయానికి ఎదురుగా ఉన్న లేన్‌కు సంబంధించిన ఫిర్యాదుకు హాజరైనప్పుడు డ్రైనేజీ ఓవర్ ఫ్లో చాలా కాలంగా సమస్యగా ఉంది, వెంటనే సాంబయ్య డీజీఎం . హెచ్ఎం డబ్ల్యూఎస్ఎస్/బి కి కాల్ చేసి సమస్యను క్లియర్ చేయమని వారికి సూచించారు. కాబట్టి రోడ్డు వేయవచ్చు. కాంగ్రెస్ నాయకులు మరియు క్యాడర్ సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, దేవేందర్, వెంకటేష్, విష్ణు, రాజు, భగీరథ ఎక్ట్ బస్తీ కాలనీ వాసులు పాల్గొన్నారు.పుదీనా తోట చంద్రా నగర్ లో బాక్స్ డ్రెయిన్ పనులు పూర్తయిన ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ద్వారా చేపట్టాల్సిన సిసి రోడ్ ప్యాచ్ పనులను చూపించారు. ఏఈ రవళి. వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలని డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేత



**గజ్వేల్ నవంబర్ 13(మన వార్త ప్రతినిధి జీ మురళి)**

గజ్వేల్ మండలం లోని బెజుగామ చిన్న ఆరెపల్లి బయ్యారం గ్రామల విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడం వల్లన ఇబ్బంది పడుతున్నరాని బస్సు సౌకర్యం కల్పించాలని గజ్వేల్ ప్రజ్ఞాపుర్ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందించిన గజ్వేల్ మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రామగిరి నవీన్.మండల ఉపాధ్యక్షులు బారు అరవింద్, మండల నాయకులు నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా నాంపెల్లి తిరుపతి నియామకం



**శంకరపట్నం:నవంబర్ 13(మనవార్త ప్రతినిధి నేరెళ్ల సంతోష్)**

హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన నాంపెల్లి తిరుపతి నియామకమైనట్లు ఏపిసీ కార్యదర్శి రఘునందన్ రావు తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్ తో పాటు 18 సభ్యులను నియామకం చేశారు. శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి తనుకు ప్రభాకర్ ను డైరెక్టర్ గా నియామకం చేశారు. శంకరపట్నం మండలం బీసీ సెల్ మండల అధ్యక్షునిగా నాంపెల్లి తిరుపతి పనిచేయగా ఆయన చేసిన సేవలను గుర్తించి నియామకం చేసినట్లు విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.తన నియామకానికి కృషి చేసిన బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్,కాంగ్రెస్ నాయకులకు నాంపెల్లి తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు...



**గంభీరావుపేట నవంబర్ 13 మన వార్త ప్రతినిధి**

గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎంపీపీ ఎస్ లో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు. బుధవారం ప్రధానోపాధ్యాయురాలు, బి చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలలో ఉపాధ్యాయులకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను ఆత్మీయంగా సత్కరించారు. పాఠశాలలో సంవత్సరాలుగా ఉపాధ్యాయులు మహేష్ కవిత, రఘుపతి మూడు సంవత్సరాలుగా దుర్గాయి, విద్యార్థులకు విద్యాబోధన చేసి ఇటీవల బదిలీ వెళ్తున్న వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, దేవరాజ్యం, రామచంద్రం, అంబేద్కర్, సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొండ దేవయ్యను కలిసిన నాయి బ్రాహ్మణులు..



**-ప్రభుత్వ విప్ సహకారంతో న్యాయం చేస్తానని హామీ..**

**వేములవాడ, నవంబర్ 13 (మన వార్త ప్రతినిధి నందు రావు):**

వేములవాడ పట్టణంలో కార్పొరేట్ స్థాయిలో నాయి బ్రాహ్మణ కులానికి చెందిన వ్యక్తి కాకుండా వేరే వ్యక్తి సెలూన్ షాప్ ఏర్పాటు చేయడం పట్ల గత మూడు రోజులుగా సెలూన్ దుకాణదారుల నిరవధిక నిరసనలు వివిధ పద్ధతుల్లో కొనసాగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్యను, నాయి బ్రాహ్మణ కులస్తులు పట్టణంలోని మున్నూరు కాపు సత్రంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. పట్టణంలో జరుగుతున్న పరిస్థితిని ఆయనకు వివరించారు. వెంటనే స్పందించిన ఆయన ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి, ప్రభుత్వ విప్ సహకారంతో న్యాయం చేస్తానని, ప్రత్యేక జీవో కూడా ఇప్పిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కులస్తులు,అధ్యక్షులు గడ్డం నవీన్,ఉపాధ్యక్షులు. సారం పెల్లి సంతోష్ ఇన్నారం రమేష్ ,కార్యదర్శి. వెల్పాల శ్రీకాంత్ అమృత అనిల్. కళ్యాణం లక్ష్మణ్. కోత్వాలు నరసింహులు. తిరుపతి. రమేష్. శ్రీధర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్ష కేంద్రాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలి



**- మర్కంటి ఏగొండ...**

**గజ్వేల్ నవంబర్ 13(మన వార్త ప్రతినిధి జీ మురళి)**

గజ్వేల్ లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో అధునాతనమైన భూసార పరీక్ష కేంద్రం నిర్మించినప్పటికీ ఈరోజు వరకు కూడా రైతులకు అందుబాటు లోకి రాలేదని సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మర్కంటి ఏగొండ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బిజెపి నాయకులు గజ్వేల్ పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం మార్కెట్ యార్డ్ లో నిర్మించిన భూసార పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విడుదల చేసిన 82 లక్షల 20 వేల నిధులతో అధునాతన భూసార పరీక్ష కేంద్రాన్ని నిర్మించినప్పటికీ అది ఈరోజు వరకు వృధాగా ఉండిపోయిందని అన్నారు. గజ్వేల్ ప్రాంతంలో అత్యధికంగా 100కు పైగా ఫర్టిలైజర్స్ ఉన్నాయని అందులో ఏ ఒక్క ఫర్టిలైజర్ షాప్ లో కూడా ఆర్గానిక్ మందులు లేవని అన్నారు. భూసార పరీక్షలు నిర్వహించేందుకు డిసెంబర్ నెల, మే నెలలో మాత్రమే సాధ్యమవుతుందని కావున ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు మేలు చేయాలని సూచించారు.వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని,సన్న వడ్లకు బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్,బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్,నాయకులు ఉప్పల మధు సుధన్, పెండ్యాల శ్రీనివాస్, అరవింద్, నాయిని సందీప్, విజయ్, వెంకట్, హరి, నవీన్, పంజా బాలు, నరసింహ, దువ్వల రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ దమ్ము, ధైర్యం ఉంటే మోడీకి వ్యతిరేకంగా మహారాష్ట్రలో ప్రచారం చేయ్



**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శిస్తే సహించేది లేదు...**

**-కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు ...**

**కరీంనగర్ నవంబర్ 13 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**

తెల్లాలేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విషం చిమ్మడం మాజీమంత్రి కేటీఆర్ కు అలవాటుగా మారిందని, ఈ పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ వెలిచాల రాజేందర్ రావు హెచ్చరించారు.బుధవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ దమ్ము, ధైర్యం ఉంటే మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రధాని మోడీకి వ్యతిరేకంగా ప్రచారం చేయాలని సవాల్ విసిరారు. ఆ దమ్ము లేకనే మహారాష్ట్రలో కాంగ్రెస్ కు ఓటు వేయొద్దని కేటీఆర్ చెబుతున్నారని, అంటే బిజెపితో వారికి లాలూచీ ఉందన్న విషయం స్పష్టంగా బయటపడు తున్నదని పేర్కొన్నారు. చివరికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన శరత్ పవర్ తరఫునైనా మహారాష్ట్రలో ప్రచారం చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం, లోక్ సభ ఎన్నికల్లో సీట్లు కోల్పోయినా వారిలో పాయచిత్తం కనిపించడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ నేతల నాటకాలన్నీ ప్రజలు గమనిస్తున్నారని, అధికారం కోల్పోయినా వారి పొగరు వంగలేదని మండిపడ్డారు.ఫార్ములా ఈ రేస్ కు 55 కోట్ల కేటాయింపు పై ఏసీబీ కేసు నమోదు, విచారణకు గవర్నర్ అనుమతి కోరడంతో కేటీఆర్ లో భయం పుట్టిందని మండిపడ్డారు. దాన్నుంచి తప్పించుకునేందుకే ఢిల్లీకి పరుగులు పెట్టారని పేర్కొన్నారు. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ప్రాపకానికి నానా తండాలు పడుతున్నారని ఆరోపించారు. ఎన్ని నాటకాలు వేసినా కేసు నుంచి తప్పించుకోలేరని, చేసిన తప్పుకు శిక్ష అనుభవించి తీరాల్సిందేనని, అది నీడ ఎల్లప్పుడు వెంటాడుతూనే ఉంటుందని పేర్కొన్నారు.అమృత్ 2.0 టెండర్లలో అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేనాటికే టెండర్లు ఖరారు అయ్యాయని స్పష్టం చేశారు. అమృత్ 2.0 పనులకు రీటెండర్ పిలిచేలా చేసిందే కేటీఆర్ అని మండిపడ్డారు. వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడితే ప్రజల్లో ఉన్న పరువు పోవడం ఖాయమని వెలిచాల రాజేందర్ రావు పలికారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల, నవంబర్ -13 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**

జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు.

బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులతో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల పై సమీక్ష నిర్వహించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాల పై పి.హెచ్.సిల వారిగా సమీక్ష నిర్వహించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ,లిప్రతి మండలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో జరుగుతున్న సాధారణ ప్రసవాలు, సి- సెక్షన్ ప్రసవాలు, అదే సమయంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో జరుగుతున్న ప్రసవాల వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మే నెల నుంచి అక్టోబర్ వరకు 3206 ప్రసవాలు జరగగా, ప్రభుత్వ ఆసుపత్రిలో 1860, ప్రైవేట్ ఆస్పత్రిలో 1308 ప్రసవాలు జరిగాయని కలెక్టర్ తెలిపారు.నవంబర్ నెలలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా ప్రసవం జరిగే అవకాశం ఉన్న గర్భిణీ స్త్రీలు మొత్తం 464 మంది ఉన్నారని, ఇప్పటి వరకు జిల్లాలో 204 ప్రసవాలు జరిగాయని అన్నారు. మిగిలిన గర్భిణీ స్త్రీలను ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూ ఉండాలని అన్నారు. జిల్లాలో తన అనుమతి లేకుండా నూతన ఆసుపత్రి రిజిస్ట్రేషన్, స్కానింగ్ సెంటర్లు ఏర్పాటు అనుమతి జారీ చేసేందుకు వీలు లేదని కలెక్టర్ తెలిపారు. ప్రతి పి.హెచ్.సి వారిగా జరుగుతున్న ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. సిరిసిల్ల జనరల్ ఆసుపత్రి పరిధిలో చిన్న పిల్లల వైద్యులు, ఇతర విభాగాల అవసరమైన ప్రత్యేక వైద్యులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లా వైద్య కళాశాల నుంచి 2 గైనకాలాజీ వైద్యులను వేములవాడ ఏరియా ఆసుపత్రికి డిపుటేషన్ పై నియమించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. లక్ష్మి నారయణ,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డా.వసంతరావు, మెడికల్ సూపరింటెండెంట్లు డా.పెంచలయ్య, డా.లక్ష్మి నారయణ,ప్రోగ్రామ్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యం పోసిన రైతులకు రోడ్డు ప్రమాదం గురించి అవగాహన కల్పించిన గజ్వేల్ సిఐ బి సైదా



**-గజ్వేల్ సీఐ సైదా...**

**గజ్వేల్ నవంబర్ 13,( మన వార్త ప్రతినిధి జీ మురళి)**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం లో ముట్రాజ్ పల్లి రోడ్డుపై బుధవారం రోడ్డులో కొంతమంది రైతులు రోడ్డుపై దాన్యం పోసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారని సమాచారం రాగా రోడ్డుపై అరబోసిన వడ్లను సంఘటన స్థలానికి వెళ్లి సంబంధిత రైతులతో మాట్లాడి రోడ్డుపై దాన్యం పోయవద్దని అవగాహన కల్పించారు ఈ సందర్భంగా గజ్వేల్ సిఐ బి సైదా మాట్లాడుతూ రోడ్లపై ధాన్యాన్ని పోసి ఇతరుల మరణానికి కారణం కావొద్దు,రోడ్లపై ధాన్యం పోయడం వల్ల వాహనదారులు మోటార్ సైకిల్ వాహనదారులు రాత్రి సమయాలలో అది గమనించక ప్రమాదం జరిగి చనిపోవుచున్నారు. బావి దగ్గర ఇండ్ల వద్ద లేదా ఇతర ప్రదేశాలలో ధాన్యం పోయడానికి ఏర్పాటు చేసుకోవాలి, నిర్లక్ష్యంగా రోడ్లపై ధాన్యం పోసి అమాయక ప్రజల ప్రాణాలు పోవడానికి కారణం కావొద్దు, రోడ్లపై ధాన్యం పోసి రాత్రి సమయంలో నల్ల కవర్ కప్పి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని మోటార్ సైకిల్ వాహనదారులు తగిలి చనిపోవడం జరుగుతుంది.రోడ్లపై ధాన్యం పోయవద్దని సూచించారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై నిర్లక్ష్యంగా పోస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## డీఈఓ జనార్ధన్ రావు ను సస్పెండ్ చేసి విచారణ జరపాలి..



**-డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి.**

**కరీంనగర్,నవంబర్13( మన వార్త ప్రతినిధి):**

కరీంనగర్ జిల్లా విద్యాధికారి సిహెచ్ .వి.ఎస్ జనార్దన్ రావు అనుచిత ,అనాలోచిత, అప్రజాస్వామిక విధానాల వలన ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘన ద్వారా జిల్లా విద్యారంగం అస్తవ్యస్తం కావడమే కాకుండా వందలాదిమంది ఉపాధ్యాయులు ఎంతో నష్టపోయారు. అలాంటి డిఇవో ను తక్షణమే సస్పెండ్ చేసి రాష్ట్రస్థాయి అధికారితో విచారణ జరిపించాలని, డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి .లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కరీంనగర్ డీఈఓ వైఖరికి నిరసనగా డిటిఎఫ్ మరియు టిపిటిఎఫ్ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు . ఈ ధర్నా కార్యక్రమానికి డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి ,టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జంకె రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు . ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి మాట్లాడుతూ 317 జీవో అమలు సందర్భంలో ,ఇటీవలి బదిలీలు, పదోన్నతుల సందర్భంలో ఎన్నో అవకతవకలకు అక్రమాలకు పాల్పడి అనేకమంది ఉపాధ్యాయులకు నష్టం కలిగించారని,అలాగే పాఠశాల పర్యవేక్షణ సందర్భంలో కూడా అకాడమిక్ విషయాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా అనవసరపు విషయాలకు ప్రాధాన్యత ఇచ్చి ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు.ఉపాధ్యాయులు చెప్పులు లేకుండా తన ఛాంబర్ లోకి రావాలనే అహంకారపూరిత ,అప్రజా స్వామిక విధానాన్ని,మధ్యయుగాల నాటి సంస్కృతిని తప్పపట్టారు.చిన్నచిన్న విషయాలకే మెమోలు, షోకాజ్ నోటీసులు ఇచ్చి సస్పెన్షన్ చేసే వైఖరిని నిరసించారు.నాలుగున్నర సంవత్సరాల సేవా కాలం పూర్తి చేసిన డిఇఓ ను తక్షణమే జిల్లా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.అలాగే టిపిటిఎఫ్ నుండి రాష్ట్ర కార్యదర్శి గుంటి ఎల్లయ్య రాష్ట్ర కౌన్సిలర్స్ కే కిషన్రావు ఎ శ్రీనివాస్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండి పరశురాములు తోపాటు సంఘీభావంగా బిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మానుపాటి రాజయ్య ,డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్స్ కె.కిషన్ రెడ్డి, టి.తిరుపతి, యం.సదానందం బి.రమేష్ వి.రాంకిరణ్ వివిధ మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా కల్లూరి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నవంబర్ 13 (మన వార్త ప్రతినిధి)**

భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా కల్లూరు వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన డివిజన్ స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక చోటు చేసుకుంది. గతంలో రెండుసార్లు డివిజన్ కార్యదర్శిగా ఎన్నికైన కల్లూరి పార్టీ కెనలేని సేవలు చేశారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర సమితి సభ్యులుగా, గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నిర్మాణ బాధ్యులుగా కొనసాగుతున్నారు. మరోసారి డివిజన్ పార్టీ బాధ్యతలను పార్టీ ఆయనకు అప్పగించింది. ఈ సందర్భంగా కల్లూరి మాట్లాడుతూ రాష్ట్ర జిల్లా పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా సిపిఐ ని గ్రామ గ్రామాన విస్తరింప చేసేందుకు కృషి చేస్తానని, డివిజన్ వ్యాప్తంగా సిపిఐ వందేళ్ళ జయంతి వేడుకలు నిర్వహించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, ములుగు జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## కలెక్టర్ కి వినతి పత్రం అందజేసిన జగిత్యాల జిల్లా ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు



**జగిత్యాల, నవంబర్ 13 (మన వార్త ప్రతినిధి సాకేత)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న సమస్త కుల గణన సర్వేలో ఉపాధ్యాయులు పాల్గొనడం చాలా సంతోషం గానే ఉందని పి ఆర్ టి యు టి ఎస్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు ఆనందం వ్యక్తం చేశారు అలాగే ఈ కార్యక్రమంలో సర్వేలో పాల్గొంటున్నటువంటి ఉపాధ్యాయుల సమయానుసారం మార్పులు చేర్పులు చేయాల్సిందిగా కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేశారు. ఇట్టి సర్వే కార్యక్రమంలో పాల్గొంటున్న ఉపాధ్యాయులు మధ్యాన్నం భోజన విరామ సమయం తర్వాత ఇంటింటికీ వెళ్ళి సర్వే నిర్వహిస్తున్న తరుణంలో ప్రతీ ఇంటిలో దాదాపుగా 30-45 నిఎఎల సమయం పడుతున్నందున, ప్రతీరోజు 15 ఇండ్లు సర్వే చేయుడం దాదాపుగా అసాధ్యం. కానీ మండలస్థాయి అధికారులు ఖచ్చితంగా ప్రతీ రోజు 15 ఇండ్లు సర్వే నిర్వహంచాలని ఖరాఖండిగా చెప్పడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. అలాగే సెలవులు వాడకుండా ప్రతీ రోజూ పనిచేయడం వలన చేసే సర్వేలో తప్పిదాలు దొర్లే అవకాశం ఉన్నది.కావున ఉపాధ్యాయుల ఆందోళనను దృష్టిలో పెట్టుకొని రోజుకు 15 ఇండ్లు సర్వే చేయాలనే నిబంధన వెంటనే నిలిపి వేయాలి. అలాగే సర్వేయడానికి గడువు పొడిగించాలి మరియు సెలవు దినాలు యధాతథంగా వాడుకునే విధంగా వెసులుబాటు కల్పించాలని జగిత్యాల జిల్లా శాఖ పక్షాన తెలపడం జరిగింది.

# ఘనంగా క్షిరాబ్ధి ద్వాదశి ఉత్సవాలు...



**జగిత్యాల, నవంబర్ 13 (మన వార్త ప్రతినిధి సాకేత)**

జగిత్యాల పట్టణంలోని పూరనిపేట శ్రీ శివపంచాయత్ శ్రీ లక్ష్మి నరసింహా స్వామి ఆలయంలో క్షిరాబ్ధి ద్వాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు లక్ష్మీ నరసింహస్వామి ఉపసకులు శ్రీ పూర్ణ చంద్ర చార్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టివేత




**ఇల్లంతకుంట నవంబర్: 13 (మన వార్త ప్రతినిధి బొంగోని రాజు)**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని వంతడుపుల గ్రామ శివారు లో బిక్కవాగు లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని పక్క సమాచారంతో బుధవారం ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అక్కడికి వెళ్లి రెండు ట్రాక్టర్లు ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకతో ఉన్నటువంటి అట్టి ట్రాక్టర్లను స్వాధీన పరచుకొని పోలీస్ స్టేషన్ కి తరలించారు.పట్టుబడిన నిందితుల వివరాలు చింతకింది నర్సయ్య,రమని బాబు,బిగుళ్ల అరుణ్ కుమార్ వీరి ముగ్గురిని రిమాండ్ కి పంపించామని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

# ప్రమాదంలో గాయపడిన యువ నాయకుడిని పరామర్శ



**గంగాధర, నవంబర్ 13 (మన వార్త ప్రతినిధి సాకేత)**

గంగాధర గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు రవీంద్రనాథ్ ఠాగూర్ కాలు కి ఇటీవలే ఆపరేషన్ జరిగింది. గంగాధర మాజీ జడ్పీటీసీ ఆకుల మధుసూదన్, కొండాన్నాపల్లి సర్పంచ్ రెండ్ల శ్రీనివాస్ వారి నివాసానికి వెళ్లి యువ నాయకుడిని పరామర్శించి తొందరగా కోలుకోవాలని తెలిపారు. రాజకీయానికి యువకులు ఎంతో అవసరమని వారు ఆరోగ్యంగా ఉంటేనే నాయకులంతా సంతోషంగా ఉంటారని వ్యక్తం చేయడం జరిగింది.

# నాణ్యమైన పత్తిని తీసుకొని వచ్చి మద్దతు ధర పొందండి..



**వేములవాడ,నవంబర్ 13( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**

సిసిఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) భారతీయ పత్తి సంస్థ వేములవాడ లోని లక్ష్మీ ఇండస్ట్రీస్, శ్రీ కావేరి కాటన్ ఇండస్ట్రీస్, శ్రీ లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీస్ మిల్లులలో పత్తి కొనుగోలు కేంద్రాలను కేటాయించింది. కాగా మిల్లులకు మంగళవారం రైతులు పత్తిని తీసుకొని వచ్చారు.లక్ష్మీ ఇండస్ట్రీస్ 503, శ్రీ కావేరి కాటన్ ఇండస్ట్రీస్ 843,, శ్రీ లక్ష్మీ నరసింహ ఇండస్ట్రీస్ 404 క్వీటల పత్తిని కొనుగోలు చేసారు.క్వింటాల్ లు గరిష్ఠ ధర రూ ,7521, కనిష్ఠ ధర రూ 7170 పలికింది.నవంబర్ 04 నుండి 12 వరకు మూడు మిల్లిలు కలిసి మొత్తం 3246.65 క్వింటల పత్తిని కొనుగోలు చేశారు. రైతులు తేమ లేకుండా పత్తిని అరబెట్టుకొని నాణ్యమైన పత్తిని తీసుకొని వచ్చి మద్దతు పొందాలని సిసిఐ అధికారులు రైతులకు సూచించారు.

# అనుమాస్ పల్లి గిరి.శ్రీను. స్వయంకృషిని అభినందించిన మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్

**నవంబర్ 13 మన వార్త ప్రతినిధి**




పల్లెటూరి నుంచి పట్టణాల్లో వ్యాపారం చేసే స్థాయికి ఎదిగిన అనుమాస్ పల్లి గ్రామానికి చెందిన గిరిని మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ అభినందించారు. పట్టణంలోని సాయి కృష్ణా నగర్ కాలనీ, సరూర్ నగర్ లో శ్రీ ద్వారకా కిచెన్ పేరుతో ఏర్పాటుచేసిన రెస్టారెంట్ ని స్థానిక నాయకులతో కలిసి ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఒకరిపై ఆధారపడకుండా స్వయం కృషితో తమ కాళ్ళపై నిలబడి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. అలాగే ఈరోజు కడ్తాల్ మండలం హనుమాస్ పల్లి గ్రామానికి చెందిన గిరి తన స్వయం కృషితో సాయి కృష్ణ నగర్ సరూర్ నగర్ లో వ్యాపారం మొదలుపెట్టడం ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే యువత ఎవరికోసం ఎదురు చూడకుండా తమకు తోచిన వ్యాపారాన్ని ప్రారంభించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు పరమేష్ మాజీ సర్పంచులు లక్ష్మీనరసింహారెడ్డి శంకర్ నాయకులు జగన్ గౌడ్ రామకృష్ణ శ్రీను దేవుల మురళి వెంకటేష్ గణేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేట లో చేప పిల్లల పంపిణీ..



**గంభీరావుపేట్ నవంబర్ 13 మన వార్త ప్రతినిధి**

గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యండి హమీద్ సూచన మేరకు పట్టన అధ్యక్షులు పాపగారి రాజు గౌడ్ మరియు డి ఎఫ్ ఒ సౌజన్య , మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది, అద్వార్యంలో ఈరోజు చేప పిల్లలను పంపిణీ చేయడం జరిగింది, ఇ సందర్భంగా వారు మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతీ కార్యక్రమం ప్రజల బాగుకోసం అహర్నిశలు పనిచేస్తుంది అని అన్నారు, ఇందులో భాగంగానే ఈరోజు గంభీరావుపేట మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని చేప పిల్లిలను ఈరోజు వారికి ఉచిత పంపిణీ చేయడం జరిగింది, అని కొనియాడారు, గంభీరావుపేటలో ఏడు చెరువులతోపాటు మానేరు డ్యామ్ ఉన్నందున ఇక్కడ మత్స్యకారుల కుటుంబాలు అధిక సంఖ్యలో ఉన్నారు అంతేకాకుండా వారు నిత్యం చేపల వేటకు వెళ్లి చేపల వేట వారి జీవన విధానం అని ఇప్పుడు కొంత ఆలస్యమైనప్పటికీ రానున్న రోజుల్లో మొదటగా గంభీరావుపేటకు ప్రాధాన్యత ఇవ్వాలని డి ఎఫ్ ఓ సౌజన్య ని కోరడం జరిగింది,ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వర్గీయులు రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు మత్స్యకారులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఇట్టి కార్యక్రమంలో వీరితో పాటు మచ్చ కారుల అధ్యక్షులు కరువారి శంకర్ మరియు కుల సంఘం సభ్యులు మరియు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా (గౌరీ) శంకర్, అక్కపెల్లి బాలయ్య జంగం రాజులు లక్కం నాంపల్లి గుడికాడి కుమార్ యువ నాయకుడు రాజశేఖర్ సీనియర్ నాయకులు గెరుగంటి రాజనర్సు రాజభోయన లచ్చన్న రవీందర్ గుడికాడి బాలయ్య , బాలకిషన్, మరియు కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదగా వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం



**నవంబర్ 13 మన వార్త ప్రతినిధి**

**-చెరువులో చేపల పంపిణీ కార్యక్రమం..**

తలకొండపల్లి మండలం లోని రాంపూర్ గ్రామం లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కల్వకుర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులందరూ ప్రభుత్వ వడ్లకు కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలి కోరారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల గురించి చేపట్టిన చెరువులలో చేపల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాశిరెడ్డి నారాయణరెడ్డి పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి. కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాటనరసింహ. తలకొండపల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి. ఎమ్మార్వో డీఎఫ్ఓ పూర్ణిమ. రాంపూర్ గ్రామం మాజీ సర్పంచ్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి.రాంపూర్ సింగల్ విండో డైరెక్టర్ ఎండి నయీముద్దీన్.మరియు సింగల్ విండో డైరెక్టర్ బృందం రాంపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ తిక్కల వెంకటయ్య. రాంపూర్ గ్రామ పెద్దలు కృష్ణా రెడ్డి. కాకి కృష్ణ. తిరుపతి రెడ్డి. హరి మోహన్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు వివిధ గ్రామాల మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసిలు కార్యకర్తలు ముదిరాజ్ సంఘం నాయకులు రైతు సంఘాల నాయకులు రైతులు యువకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించిన ఎస్ ఆర్ ఎమ్ బ్రైట్ బిస్ స్కూల్



**హుజూర్ నగర్ నవంబర్ 13 (మన వార్త)**

హుజూర్ నగర్ పట్టణంలోనిఎస్ ఆర్ ఎమ్ బ్రైట్ బి స్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. పాఠశాల ప్రాంగణం పిల్లల ఆనంద కేకలతో మార్మోగి పోయింది . ఈ కార్యక్రమానికి ఎస్సార్ ఎమ్ బ్రైట్ బిస్ చైర్మన్ కేశినేని శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. శ్రీదేవి మాట్లాడుతూ నేటి పిల్లలే రేపటి మన దేశ భవిష్యత్తు వారి ఆరోగ్యం ,విద్య, శిక్షణలో భాగస్వామ్యం కావడం అందరం బాధ్యతగా భావించాలి. వారు అందిపుచ్చుకునే ప్రతి అవకాశాన్ని మెరుగుపరుచుకోవడం చాలా ముఖ్యం అని అన్నారు. చిన్నారులు ఏ రంగంలోనైనా అద్భుతం విజయాలు సాధించడానికి పాఠశాల సమగ్రమైన వాతావరణాన్ని అందిస్తుందని ఆమె తెలియజెశారు.విద్యార్థులు ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు జింగ్లింగ్ తాళాలతో కూడిన లెజెండ్ జానపద నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమం లో ఈ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# చింతలపాలెం మండల పరిధిలో టెన్త్ ఎగ్జామ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలి




**హుజూర్ నగర్ నవంబర్ 13 (మన వార్త)**

సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం చింతలపాలెం మండల పరిధిలో ప్రతి సంవత్సరం వందల మంది విద్యార్థినీ విద్యార్థులు టెన్త్ ఎగ్జామ్స్ రాయటానికి ఇతర మండలాలకు వెళ్ళవలసి వస్తుంది కావున ఈ సంవత్సరం 2024%ఉ%25.. 260 మంది పదోవ తరగతి విద్యార్థులు చదువుతున్నారు.ఈ సంవత్సరం నుంచైనా విద్యార్థులకు అన్ని సదుపాయాలు ఉన్న చింతలపాలెం మండల కేంద్రంలో టెన్త్ ఎగ్జామ్స్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిందిగా కోరుకుంటున్నాము.చింతలపాలెం మండలం ఎంఈఓ శ్రీనివాస్ స్పందించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చింతలపాలెం మండల కేంద్రంలో టెన్త్ ఎగ్జామ్స్ సెంటర్ ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాల్సిందిగా కోరుకుంటున్నాము.ఈ కార్యక్రమంలో మోర్తాల నాగిరెడ్డి తన్నీరు శ్రీను ఎస్కే సోందుమియా పాల్గొన్నారు

# అపోలో రిచ్ ఎన్ఎస్ఆర్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




**జమ్మికుంట, నవంబర్ 13( మన వార్త ప్రతినిధి):**

అపోలో రిచ్ ఎన్ ఎస్ ఆర్ హాస్పిటల్ వరంగల్ వారి ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని శివాలయం (బొమ్మలగుడి) దగ్గర అనుభవజ్ఞులైన వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు,సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్ లు పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు.ఈ వైద్య శిబిరంలో బీపీ,షుగర్, ఈసీజీ,గుండెకి,మోకాళ్ళ నొప్పులకు, నరాలకు, జ్వరాలకు సంబంధించిన వ్యాధులకు 220 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.జమ్మికుంట పట్టణ మరియు పరిసర ప్రాంతాల ప్రజలు పరీక్షలు చేయించుకోని మందులు తీసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు అనునిత్యం వివిధ పనులలో నిమగ్నమై ఉన్నందున ఆరోగ్యపరంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి కోరారు. ఈ వైద్య శిబిరం నిర్వహించిన అపోలో ఆస్పత్రి యాజమాన్యానికి,విద్యులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఆసుపత్రి సిబ్బంది మాట్లాడుతూ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలాలలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు.అదేవిదంగా అపోలో ఆస్పత్రిలో ఇన్స్యూరెన్స్ సౌకర్యం ఉంటుందని తెలిపారు.ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, సొసైటీ చైర్మన్ సంపత్, కౌన్సిలర్లు,ఆసుపత్రి వైద్యులు,సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

## బీజేపీ పార్టీకి బూత్ కమిటీలు పట్టు కొమ్మలాంటివి



**శాయంపేట(మన వార్త నవంబర్ 13)**శాయంపేట మండలంపేరు స్సేన్ వల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన సంస్థాగత ఎన్నికల కార్యశాల 2024 వర్క్ షాప్ మండల అధ్యక్షుడు గడ్డం రమేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జయశంకర్ భూపాలపల్లి సభ్యత్వ నమోదు ప్రముఖ జన్న్ మొగిలి హాజరై మాట్లాడుతూ బీజేపీ పార్టీకి బూత్ కమిటీలు పట్టు కొమ్మలు లాంటివి అని కాబట్టి శాయంపేట మండలంలోని అన్ని బూత్ లో త్వరగా సభ్యత్వలు పూర్తి చేసి బూత్ కమిటీ వెయ్యడానికి అర్హత సాధించాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అంతే కాకుండా ప్రతి బూత్ లో 100 సభ్యత్వాలు పూర్తి చేసి ఆ బూత్ కు బూత్ కమిటీ వేయడం కోసం అర్హత సాధించే విధంగా అందరూ ప్రయత్నం చేయాలనీ ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి జరిగే సభ్యత్వ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టత్మకంగా తీసుకొని వందశాతం పూర్తి చేయాలనీ బీజేపీ పట్ల, నరేంద్ర మోదీ పట్ల ప్రజల్లో పూర్తి విశ్వాసం ఉందని మెంబర్షిప్ చేయడం కోసం స్వయంగా ముందుకు వస్తున్నారని కావున వారిని కలిసి వారికీ సభ్యత్వం ఇచ్చి బీజేపీ పార్టీ కీ మద్దతు తెలిపే విధంగా కృషి చేయాలనీ ఈ సందర్భంగా తెలియజేశారు. 100 సభ్యత్వాలు చేసిన వారికి క్రియాశీల సభ్యత్వానికి అర్హులని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉపాధ్యక్షులు రాయరాకుల మొగిలి,నాయకులు ఉప్పు రాజు, నరహరి శెట్టి రామకృష్ణ, కానుగుల నాగరాజు, బాసని విద్యాసాగర్,ఎర్ర రాకేష్ రెడ్డి, లడే శివ, సంజయ్ చంద్ర మొగిలి,పున్నం సాంబయ్య, రమేష్, తిరుపతి ,సుధాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి వెళ్లకుండానే అందర్ని ఒక్కదగ్గర చేర్చి సర్వే



**హసన్ పర్తి నవంబర్ 13(మనవార్త ప్రతినిధి ):**రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలుపరుస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. సూదన్ పల్లి గ్రామం లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే అతీ గతి లేకుండా జరుగుతుంది దీనికి తోడు ఎన్యూమారేటర్లు లేకుండా ఇంటింటికి వెళ్లకుండాఎక్కడో ఒక కాడ ఉండి అందరిని పిలిపించుకొని. కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఇంటి వద్దకు రాకుండానే సర్వే ఫారం లు నింపుతున్నారు దీంతో ప్రజలు ఆగ్రహ వేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎన్యూమరేటరకు 150 నుండి 175 ఇండ్ల జాబితాన్ని కేటాయించారు అలాగే పదిమంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్వైజర్ ను నియమించారు. సర్వే తీరును పరిశీలించేందుకు నోడల్ అధికారులను ఏర్పాటు చేశారు. అయితే ఎన్యూమరేటర్లు ఇంటికి వెళ్లి చేయడం ఆలస్యం అవుతుందనే నెపంతో ఇలా చేస్తున్నారని తెలిసింది సూపర్వైజర్స్ సైతం ఎన్యూమరేటర్లని పట్టించుకోక పోవడంతో సర్వే తూతు మంత్రాంగా కొనసాగుతుంది. అలాగే నోడల్ అధికారులు గ్రామాలకు వెళ్లి సర్వే తీరును పరిశీలించకుండానే ఫోటోలకే పరిమితం అవుతున్నారు సర్వే ఇలా కొనసాగడంతో ప్రభుత్వ లక్ష్యం ఎలా నెరవేరుతుందని పలువురు వాపోతున్నారు కుటుంబ సర్వే నాలుగో దశకు చేరుకుంది సర్వే సిబ్బంది తాము గ్రామాలకు రాకుండానే బినామీలను పంపిస్తూ వారితో సర్వే ఫారంనింపిస్తున్నట్లు పలు గ్రామాల నుండి పక్కా సమాచారం వుంది ప్రధానంగా జిల్లా క్రిందానికి అతి సమీపంలోని హసన్ పర్తి మండలం సూదన్ పల్లి, గ్రామం తో పాటు పలు గ్రామాలలో ఈ తతంగం కొనసాగుతున్నాది స్థానిక గ్రామ ప్రత్యేక అధికారి పంచాయితీ కార్యదర్శి తో పాటు తదితర సిబ్బంది ఈ సర్వేను పట్టించుకోకపోవడంతో ఎన్యూమరేట్లదే ఇష్టా రాజ్యాంగ మారింది. గ్రామంలోని యువత ఈ సర్వేలో కొనసాగుతున్న లోటు పాట్లను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లడానికి రంగ సిద్ధం చేస్తున్నారు.

## ముదిరాజుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి



**హసన్ పర్తి నవంబర్13(మనవార్త ప్రతినిధి ):**ముదిరాజుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హసన్ పర్తి మండల కేంద్రంలోని ముదిరాజు కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం, అమ్మవారి కళ్యాణం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి కళ్యాణ మహోత్సవం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజు కులస్తుల పెద్దలు ఎమ్మెల్యే ను శాలువాలతో సత్కరించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ ఏఎంసి వైస్ చైర్మన్ తంగేళ్లపల్లి తిరుపతి, హసన్ పర్తి మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, పెద్దమ్మ నర్సింహా రాములు,66వ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్,మండల మహిళా అధ్యక్షురాలు జోరుక,పూల,స్వాతి, కాంగ్రెస్ నాయకులు వీసం సురేందర్ రెడ్డి, గొర్రె కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో తులసి కళ్యాణం



**గజ్వేల్ నవంబర్ 13(మన వార్త ప్రతినిధి జీ మురళి)**
సిద్దిపేట జిల్లా గజ్వేల్ లోని శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో ఘనంగా కార్తీక మాసం పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తులసి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారం అందజేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ కమిటీ అధ్యక్షులు జగ్గయ్యగారి శ్రీనివాస్, లయన్ నేతి శ్రీనివాస్ మాట్లాడుతూ అందరికీ కార్తీక మాసం శుభాకాంక్షలు తెలిపి ఈశ్వరుని అనుగ్రహం తో అందరూ బాగుండాలని కోరుకుంటూ, అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో కార్తీకమాసం పూజలు కొనసాగుతున్నాయని అందులో భాగంగా తులసి పూజ మహోత్సవం నిర్వహించడం జరిగిందని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయురాలి కి ఘన సన్మానం..




**వేములవాడ నవంబర్ 13 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మరిమడ్ల ప్రభుత్వం ఉపాధ్యాయురాలు ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులు టి శాంత కుమారి తెలుగు పండితురాలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మర్రిమడ్ల కి కరీంనగర్ లోని ఫిల్మ్ భవన్ లో (టీఎస్ మేసా) తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ అద్వర్యంలో నేషనల్ ఎడ్యుకేషన్ డే సందర్భంగా విద్యవ్యాప్తికి విశేష సేవలు అందించిన దివంగత నేత భారత దేశ తోలి విద్యాశాక మంత్రి మౌలాన అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అథితిగా పాల్గొన్న మానకొండూరు శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా ఘన సన్మానం జరిగింది ఇందులో శాసన సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చి దిద్దబడుతుందని అన్నారు. తల్లితండ్రి తర్వాత గురువే పిల్లలకు దైవం లాంటి వ్యక్తి అని అన్నారు గురువు లేకుంటే సమాజం చీకటితో నిండిపోయి అజ్ఞాన అందకారంతో ముందుకు కదలలేని స్థితిలోకి మారిపోతుందని అన్నారు ఈ సమాజానికి ఉపాధ్యాయులే దిక్సూచి ఊపిరి అని అలాంటి ఊపిరిని సన్మానించుకోవడం మన పూర్వజన్మ సుకృతం అని అన్నారు ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మీసాల మల్లిక్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వంగ మహేదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 16న 41వ ఎన్యువల్ గ్రాడ్యుయేషన్ డే ని కిట్స్ వరంగల్ క్యాంపస్‌లోని ప్లే ఫీల్డ్స్‌లో నిర్వహిస్తుంది



**హన్మకొండ జిల్లా హసన్ పర్తి నవంబర్13(మనవార్తప్రతినిధి ):**స్వయం ప్రతిపత్త బ్యాచ్‌ల (2020–2024) 41వ వార్షిక గ్రాడ్యుయేషన్ డే కి సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి చేతుల మీదుగా కిట్స్ వరంగల్ క్యాంపస్‌లోని కమిటీ హాల్‌లో ఆవిష్కరించారు. కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, వరంగల్, (కిట్స్ వరంగల్) తెలంగాణ వారు 41వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు 2024 నవంబర్ 16 న (శనివారం) రోజు న ఎడవ అటానమస్ బ్యాచ్ (2020–24) విద్యార్థుల కోసం జరుపుకుంటారు. ఈ కార్యక్రమం ని కిట్స్ వరంగల్ క్యాంపస్‌లోని ప్లే ఫీల్డ్స్‌లో విద్యార్థుల విజయాలు మరియు ప్రశంసల అద్భుతమైన రికార్డుతో ఘనంగా నిర్వహిస్తామని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.అశోక రెడ్డి సగర్వంగా తెలిపారు. ఈ వార్షిక గ్రాడ్యుయేషన్ డే కిముఖ్య అతిథిగా వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, గౌరవ అతిథిగా కాకతీయ యూనివర్సిటీ, వరంగల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హాజరుకానున్నారు. బంధించి వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 28 మందికి బంగారు పతకాలు అందజేయనున్నారు. మా విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలలో క్రీడలు మరియు ఆటలలో అథ్లెటిక్స్‌లో ఓవరాల్ కె యు ఛాంపియన్‌షిప్ పొందారు. లైబ్రరీ లో రిమోట్ యాక్సెస్ విధానం ద్వార విద్యార్థులు, అధ్యాపకులు సులభ రీతిలో ఉపయోగించుకోవచ్చుఅని తెలిపారు. విద్యా సంవత్సర (ఏవై) 2020–24 బ్యాచ్ రిజిస్ట్రేషన్ చేయించు కున్న విద్యార్థులు డిగ్రీ పట్టా పొందేందుకు తప్పకుండా వార్షిక గ్రాడ్యుయేషన్ డేకు హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్, ప్రొఫెసర్ ఎం. కోమల్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రో. వి రాజగోపాల్, అకడమిక్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ కె. వేణుమాధవ్, ఈ ఈ ఈ విభాగపు సీనియర్ ప్రొఫెసర్, వి రామయ్య మరియు హెడ్, ఇ సి ఇ డాక్టర్ వి. వెంకటేశ్వర రెడ్డి, హెడ్, సివిల్ ఇంజనీరింగ్ డా. ఎం. ఆండాళ్, అసోసియేట్ ప్రొఫెసర్, ఫిజికల్ సైన్సెస్ మరియు పి. ఆర్. ఓ. డా. డి. ప్రభాకరా చారి వివిధ విభాగాల డీన్లు మరియు వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు, పాల్గొంటారు.

## డాక్టర్ ఆనంద రెడ్డి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



**-లచ్చవ్వ అనే మహిళా ప్రాణాలు కాపాడిన వైద్యులు**
**-మహిళా కడుపులో 5 కిలోల కణతిని ఆపరేషన్ చేసి తొలగింపు..**
**వేములవాడ నవంబర్ 13 ( మన వార్త ప్రతినిధి దెబ్బేటి ప్రవీణ్ )**
కడుపు నొప్పి.. ఆయాసంతో బాధపడుతున్న ఓ మహిళకు వేములవాడ పట్టణంలోని డాక్టర్ ఆనంద రెడ్డి (అమృత నర్సింగ్ హెూం) ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేసి సుమారు 5 కిలోల కణతిని వైద్యులు తొలగించారు. చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన లచ్చవ్వ (60) అనే మహిళ కడుపు నొప్పితోపాటు ఆయాసంతో బాధపడుతోంది. ఆమెను కుటుంబ సభ్యులు పట్టణంలోని డాక్టర్ ఆనంద రెడ్డి ఆసుపత్రికి వైద్య పరీక్షల నిమిత్తం తీసుకొచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు మహిళా కడుపులో భారీ సైజులో కణతి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈరోజు బుధవారం గంటన్నర పాటు శస్త్రచికిత్స చేసి సుమారు 5 కిలోల కణతిని వైద్య బృందంతో కలిసి విజయవంతంగా తొలగించామని డాక్టర్ ఆనంద రెడ్డి తెలిపారు. ఈ అరుదైన ఆపరేషన్లో పాలుపంచుకున్న డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సుమన్ మోహన్ రావు, డాక్టర్ ముస్కు వర్షా రెడ్డి, అమృత నర్సింగ్ హెూమ్ సిబ్బందికి లచ్చవ్వ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం లచ్చవ్వ ప్రాణానికి ఎలాంటి ప్రమాదం లేదని ఆరోగ్యంగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు...



**-గంజాయి సేవిస్తూ,విక్రయిస్తూ అరెస్ట్...**
**-200 గ్రాముల గంజాయి స్వాధీనం...**
**-జగిత్యాల జిల్లా పోలీసులు...**
**జగిత్యాల ,నవంబర్ 13 (మనవార్త ప్రతినిధి సాకేత)**
మల్లాపూర్ మండల కేంద్రంలోని రత్నాపూర్ శివారులో ఉన్న స్మశాన వాటిక దగ్గర గంజాయి సేవిస్తుండగా మెట్పల్లి పట్టణ సీఐ నిరంజన్ రెడ్డి మరియు , మల్లాపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ సిబ్బందితో కలిసి ఇద్దరు వ్యక్తులను పట్టుకొని విచారించడం జరిగింది. వారు మెట్ పల్లి ఫరిదిలో పలు గ్రామాల్లో గంజాయి అమ్ముతున్నారని తెలుసుకొని నిఘా ఏర్పాటు చేసి శివ సాయి ,రవితేజ అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని, మత్తు పదార్థాలకు బానిస అవటం వల్ల భవిష్యత్తును నాశనం అవుతుందని అన్నారు. మత్తు పదార్థాలు విక్రయిస్తూ పట్టుపడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్పల్లి పట్టణ సీఐ నిరంజన్ రెడ్డి, మల్లాపూర్ ఎస్సై కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు

## రేషన్ బియ్యం పట్టివేత...



**హసన్ పర్తి నవంబర్ 13(మనవార్తప్రతినిధి):**అక్రమంగా రేషన్ బియ్యాన్ని డిసిఎంలో తరలిస్తుండగా బుధవారం ఉదయం హసన్ పర్తి పోలీసులు పట్టుకున్నారు. సబ్ ఇన్స్ పెక్టర్ సిద్దయ్య తన సిబ్బందితో హసన్ పర్తి మండల కేంద్రంలోని చిన్నంగి చెరువు కట్టమీద పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానస్పదంగా వెళుతున్న వ్యాన్ ను తనిఖీ చేశారు. ఆ డిసిఎంలో పైన తాల్ వడ్లు,లోపల రేషన్ బియ్యాన్ని కనుగొన్నారు. అనుమానం రాకుండా పైన వడ్లు లోపల రేషన్ బియ్యాన్ని తీసుకెళ్తున్నట్లు పోలీసులు తెలిపారు. డీసీఎం డ్రైవర్ గద్దల రవి వర్మను పోలీసులు విచారించారు. చింతగట్టులో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని జంగిలి సుధాకర్ చిత్తారి కోటిలింగం లు ఈ డిసిఎంలో తరలిస్తున్నట్టు తెలిసిందని పోలీసులు తెలిపారు. 16 టన్నుల బరువు గల రేషన్ బియ్యాన్ని 32 ప్లాస్టిక్ సంచులలో తరలిస్తున్నారని సి ఐ చేరాలు తెలిపారు. వీటి విలువ 4 లక్షల48 వేల ఉటుందని పేర్కొన్నారు డ్రైవర్ గద్దల రవివర్మను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. తరలింపు కారకులైన జంగిళి సుధాకర్, చిత్తారి కోటిలింగంలు పరారీలో ఉన్నారని,వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ చేరాలు తెలిపారు.